క్లుప్తంగా

12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ రావి దుర్గా వాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సభా మందిరంలో నిర్వహించే సమావేశానికి అధికారులు సమాచారంతో రావాలని కోరారు.
కోడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన మధ్యాహ్నం 2గంటలకు స్థానిక కార్యాలయంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

భాషా నైపుణ్యం పెంపునకే తెలుగు తేజం



పెడన: విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపునకు 'తెలుగు తేజం' ఉపయోగపడుతుందని చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ హెచ్ సిద్దినేని సౌజన్య తెలిపారు. చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం తెలుగు తేజం పాఠశాల స్థాయి తెలుగు పత్రిక 5వ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు రాసిన, సేకరించిన కథలు, కవితలు, కవుల పరిచయాలు, చమత్కార పద్యాలు, విద్యార్థులు గీసిన చిత్రాలు ఈ పత్రికలో పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కలిదిండి రాంబాబు, పరిశే రాజేశ్వరరావు, ఎం.పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛనర్ల సాయం



మచిలీపట్నంటౌన్: నగరంలో 29వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సామాజిక పింఛన్ లబ్ధిదారు అంకాని ఏడుకొండలు ఇటీవల మరణించాడు. ఆ డివిజన్‌లోని తోటి పింఛనర్లు తలో రూ. 100 ఇవ్వగా వచ్చిన రూ. 35,600 ఏడుకొండలు కుటుంబానికి శుక్రవారం అందించారు. కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ ఈ నగదును ఏడుకొండలు భార్య అనంతమ్మకు అందజేశారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం



కోనేరుసెంటర్: కరగ్రహారంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ 50వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బొర్రా నటేష్‌బాబు తెలిపారు. ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవ పత్రాలను గ్రామంలో పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరి ఆలయంలో 15 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మట్టా నాగరాజు, మట్టా పాండురంగారావు, పరసా మహాలక్ష్మి, నిరీక్షణరావు, పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి



అవనిగడ్డ: మచిలీపట్నం పోస్టల్ డివిజన్ పరిధిలో నిర్వహించిన దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పోటీల్లో మొదటి బహుమతి సాధించిన సెయింట్‌ఆన్స్ హైస్కూల్ విద్యార్థి సిర్విశెట్టి వోహిద్‌కు శుక్రవారం అవనిగడ్డ పోస్టు మాస్టర్ గిరీష్ అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ మోలీ థామస్ ప్రిన్సిపాల్ అమల పుష్పం, వైస్ ప్రిన్సిపాల్ మోనీ, పోస్టల్ సిబ్బంది నరేష్, బాజీ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత



గూడూరు: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచడం పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని గూడూరు ఎంపీపీ సంగా మధు అన్నారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఆకూరి శ్రీనివాసరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, లింగం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నం ప్రధాన పార్కులోని గ్రీనరీలో సేదతీరుతున్న ప్రజలు, ఏర్పాటుచేసిన ఫౌంటెన్



● ఆహ్లాదం, ఆరోగ్యం

ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించడానికి నగరంలోని పలు పార్కులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ. 3.76 కోట్లతో అభివృద్ధి చేశారు. కొత్త పార్కుల ఏర్పాటుతో పాటు ఉన్న పార్కులకు ఆధునిక హంగులు సమకూర్చారు. నగరంలోని పలు డివిజన్ల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులకు వెళ్లి సేదతీరుతున్నారు. వాకింగ్ ట్రాక్‌లలో నడుస్తూ, జిమ్ పరికరాలను ఉపయోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. పిల్లలు ఆటవస్తువులను వినియోగిస్తూ ఆనందంగా గడుపుతున్నారు.

–మచిలీపట్నంటౌన్



పంచాయతీరాజ్‌కాలనీలోని పార్కులో ఆట పరికరాలు



షార్కీ కాలనీ పార్కులో ఓపెన్ జిమ్

ఉత్కంఠగా బాలల క్రీడలు

నాగాయలంక: మండల విద్యాశాఖ, విద్యాకుటుంబం ఆధ్వర్యాన జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో మండల స్థాయి బాల, బాలికల ఆటల పోటీలు సందడిగా జరుగుతున్నాయి. వీటిలో కబడ్డీ, నూండీ (కుందుళ్లు), ఖోఖోలో బాలలు గెలుపే లక్ష్యంగా దూసుకుపోతూ ఫైనల్ విజేతలుగా నిలిచారు. శుక్రవారం జరిగిన వివిధ క్రీడల్లో కబడ్డీ ఆటలో సీనియర్స్(6,7,8 తరగతులు)విభాగంలో నాలి పాఠశాల బాలికలు, బాలురు జట్లు విన్నర్స్, ఖోఖోలో రన్నర్స్‌గా నిలిచారు. బాలికల ఖోఖోలో సొర్లగొంది, బాలురు ఖోఖోలో గణపేశ్వరం, బాలికల కబడ్డీలో కమ్మనమోలు విద్యార్థులు గెలుపొందారు. జూనియర్స్ విభాగం క్రీడల్లో చోడవరం, సొర్లగొంది పాఠశాలలు ప్రథమ స్థానంలో, దీనదయాళ పురం, ఎదురుమొండి, భావదేవరపల్లి పాఠశాలల బాలలు ద్వితీయ స్థానంలో నిలిచారు. 1, 2 తరగతుల బాలలకు ఆంగ్లం, తెలుగులో డిక్టేషన్, రైమ్స్, పెయింటింగ్ 3,4,5తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, పద్యాలు, బుక్‌రివ్యూ, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. 500మందికి పైగా విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. ఎంఈవోలు టీవీఎం రామదాసు, ఎ.రామారావుల పర్యవేక్షణలో పీడీలు, పీఈటీలు క్రీడలు నిర్వహిస్తున్నారు. పోటీలు 12వ తేదీ వరకు కొనసాగుతాయి.



నాలి, గణపేశ్వరం పాఠశాలల బాలికల మధ్య కబడ్డీ పోటీలు

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చు

పెడన: క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారించడానికి ఎక్కువ అవకాశాలుంటాయని హెచ్‌సీజీ హాస్పిటల్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ రాయల్ అన్నారు. ఆయన పెడన, గూడూరు మండలాలకు చెందిన గ్రామీణ వైద్యులకు శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం పెడన షాదీఖానాలో నిర్వహించారు. తొలుత పెడన, గూడూరు మండలాల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం పెడన ఏరియా అధ్యక్షుడు రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు.
అనంతరం జరిగిన గ్రామీణ వైద్యులకు క్యాన్సర్, జనరల్ మెడిసిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ రాయల్ మాట్లాడుతూ శరీరంలో మార్పులు వస్తే సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు. 40 సంవత్సరాలు దాటిన మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని చెప్పారు. విజయవాడ సెంటినీ హాస్పిటల్ జనరల్ మెడిసిన్ డాక్టర్ హరీష్ మాట్లాడుతూ ఐదు నుంచి ఏడు రోజులలో జ్వరం తగ్గకపోతే వెంటనే క్వాలిఫైడ్ డాక్టర్ వద్దకు పంపాలని తెలిపారు.
షుగర్ ఎక్కువ ఉన్న పేషెంట్లకు గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లి రాంబాబు, జిల్లా కార్యదర్శులు వి.జగదీష్, ఎండీ బషీర్, జిల్లా ఉపాధ్యక్షులు, ఏరియా గౌరవ అధ్యక్షులు ఎం రాజలింగం, పెడన ఏరియా కార్యదర్శి బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ వైద్యుల సదస్సులో వక్తలు

కార్మిక చట్టాలను వినియోగించుకోండి

బంటుమిల్లి: కార్మిక చట్టాలను వినియోగించుకోవాలని న్యాయసేవాధికార సమితి చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకరరావు అన్నారు. స్థానిక బీఎస్ఆర్ కాలనీలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు పనుల సమయంలో ప్రమాదాలకు గురైనా, శ్రమకు తగ్గ వేతనాలు పొందడానికి చట్టాలు రక్షణ కల్పిస్తాయన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం నేరమన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, వై.సోమశేఖర్, తమ్మన సురేష్, ఎస్.సురేష్, ఏఎస్సై మురళి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

సందడిగా నోబుల్ చారిటీ డే

మచిలీపట్నంటౌన్: స్థానిక నోబుల్ కళాశాలలో నోబుల్ చారిటీ డే ను శుక్రవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. నోబుల్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు రాబర్ట్ టర్లింగ్ టన్ నోబుల్ జయంతి సందర్భంగా ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర మహిళల ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జె ఎర్నెస్ట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మంజుల శ్రీవేణి, కో–ఆర్డినేటర్ డాక్టర్ పి శాంతి, అధ్యాపకులు షాలినీ, దివ్య, జ్యోత్స్న, నాగవాణి, సుస్మిత పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి బిషప్ కొర్నేలియస్ ఆయన సతీమణి జాషువా కుమారి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు.



కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ దృశ్యం

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

తోట్లవల్లూరు: పేదలకు ఆపన్నహస్తం అందించటంలో లయన్స్‌క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకర్‌గుప్తా తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మండలంలోని యాకమూరులో 30 పేద కుటుంబాలకు నిత్యావసర కిట్‌లను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, క్యాబినెట్ కార్యదర్శి నూకల సాంబశివరావు, ప్రతినిధులు వేమూరి సత్యనారాయణ, రామకృష్ణప్రసాద్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చక్రధర్, రవీందర్, రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులకు శుక్రవారం టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం టి.హనుమప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను బహూకరించామని తెలిపారు. స్కూల్ కాంప్లెక్సు సెక్రటరీ కొంతి అంకరాజు పాల్గొన్నారు.

20న హంసలదీవిలో సత్యదేవుని వ్రతాలు

కోడూరు: భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని విశ్వశాంతి యాగ మహోత్సవ కమిటీ ఆధ్వర్యాన హంసలదీవిలో ఈ నెల 20న సత్యదేవుని వ్రతాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు మోపిదేవి చక్రవర్తి శుక్రవారం తెలిపారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి దేవాలయ సమీపంలో 1008 మంది దంపతులతో రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు గోపూజ, విష్ణు సహస్రనామ పారాయణం, మురళీకోలాటం, పండరి భజనలు ఉంటాయని చక్రవర్తి వివరించారు. టీటీడీ వేదపండితులు వ్రతాలను జరిపిస్తారని తెలిపారు

రోడ్డుకు మరమ్మతులు

కోడూరు: నరసింహపురం నుంచి నారేపాలెంకు వెళ్లే డొంక రోడ్డు మరమ్మతులను మండల పరిషత్ అధికారులు చేపట్టారు. పిట్టల్లంక, సాలెంపాలెం, వేణుగోపాలపురం, నారేపాలెం, నరసింహపురం గ్రామాల ప్రజలు నిత్యం ఈ డొంక రోడ్డు మీదుగా ప్రయాణిస్తుంటారు. రోడ్డుకు మరమ్మతులు చేయాల్సి ఉండటంతో స్పందించిన ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి మండల పరిషత్ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించి, పనులను వేగవంతంగా నిర్వహించారు. రోడ్డును చదును చేస్తూ, రెండువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణ రావు పర్యవేక్షించారు.

పీవీకి భారతరత్నపై హర్షం

చల్లపల్లి: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న ఇవ్వడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనకు సముచిత గౌరవం ఇచ్చిందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 10వ తేదీ శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మాచవరం, దేవునిచెరువు, కోతిబొమ్మసెంటర్, పెడన బైపాస్‌రోడ్డు, వలందపాలెం, నేలగిరి, జిల్లా పరిషత్ సెంటర్, పట్టాభిపురం, గంగులతోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.
పెడన: పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జయరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం నేపథ్యంలో నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెన్స్ దృష్ట్యా మూడు గంటల పాటు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆధునిక హంగులతో హోండా యాక్టివా రిమోట్ వాహనం

మచిలీపట్నంటౌన్: హోండా కంపెనీ విడుదల చేసిన నూతన వాహనం యాక్టివా హెచ్ స్మార్ట్ రిమోట్ వాహనం ఆధునిక హంగులతో వినియోగదారులను ఆకట్టుకునేలా ఉందని హోండా జోనల్ హెడ్ శరత్ ఉండ్రె అన్నారు. నగరంలోని నాగసాయి మోటార్స్ వద్ద వాహన అమ్మకాల ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నూతన వాహనం రిమోట్ కంట్రోల్, ఆధునిక భద్రత కలిగి ఉండటంతో మచిలీపట్నం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులకు ఆ సంస్థ 22 వాహనాలను కొనుగోలు చేసి అందించిందన్నారు. హోండా ఏరియా మేనేజర్ మంజునాథ పాటిల్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కె.వెంకట్రావు, అన్విత హోండా ఎండీ ఎస్.శ్రీనివాసరావు, నాగసాయి మోటార్స్ అధినేత యిమ్మిడి నగేష్ పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాలకు టేబుల్, కుర్చీల వితరణ

పమిడిముక్కల: అగినపర్రు శివారు బొడ్డువానిగూడెం ప్రాథమిక పాఠశాలకు నారాయణపురానికి చెందిన ఎన్ఆర్ఐ కూచిబొట్ల కిరణ్‌కుమార్ ఆఫీస్ టేబుల్, 10 కుర్చీలు బహూకరించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధి చేసిన జలం అందించడానికి చర్యలు

- ● రూ.30లక్షలతో హెడ్‌వాటర్ వర్క్స్ హౌస్ అభివృద్ధి
- ● మరో రూ.15లక్షలు కేటాయించడానికి కృషి
- ● హెడ్ వాటర్ వర్క్స్‌ను సందర్శించిన ఉప్పాల రాము

పెడన: ప్రజలకు భవిష్యత్తులో శుద్ధి చేసిన జలం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. పెడన పురపాలక సంఘ పరిధిలో శుక్రవారం రామరాజు పంట కాలువ పక్కనే ఉన్న పురపాలక సంఘ హెడ్‌వాటర్ వర్క్స్ హౌస్‌లోని వాటర్ ఫిల్టర్ బెడ్‌లను కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. పట్టణ జనాభా, తాగునీరు సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి రూ.30 లక్షల ప్రత్యేక గ్రాంట్‌ను మంజూరు చేయించినట్లు తెలిపారు. మరో రూ.15 లక్షలు మంజూరుకు అంచనాలను తయారు చేయాలని ప్రజారోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఆయనతో పాటు పెడన కౌన్సిలర్లు కటకం ప్రసాద్, భళ్ల గంగయ్య, మెట్ల గోపీప్రసాద్, పిచ్చిక సతీష్, మెట్ల సుబ్రహ్మణ్యం, శిరవెళ్ల జయేష్, కో–ఆప్షన్ సభ్యులు వీరంకి నరసింహారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, ఇన్‌చార్జ్ కమిషనర్ ఏసుబాబు, ఏఈఈ సీతారామాంజనేయులు, సచివాలయల కన్వీనర్ మతీన్‌ఖాన్, కోడూరు శీను, ముత్యాల మురళి, వన్నెంరెడ్డి మహంకాళ రావు, మాదాసు బాబురావు పాల్గొన్నారు.



హెడ్ వాటర్ వర్క్స్‌లో తాగునీటిని పరిశీలిస్తున్న ఉప్పాల రాము తదితరులు

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మచిలీపట్నంటౌన్: టిడ్కో గృహాల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ చెప్పారు. నగరంలోని గో సంఘం వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను శుక్రవారం మేయర్ వెంకటేశ్వరమ్మ మునిసిపల్, టిడ్కో ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. సముదాయాల్లో ఉన్న ప్లాట్లను పరిశీలించి అన్ని వసతులు సక్రమంగా ఉన్నదీ, లేనిదీ చూశారు. ప్లాట్లలో సమస్యలను పరిష్కరించాలని ఇంజినీర్లను ఆదేశించారు. గృహాలను ఈ నెల 15వ తేదీలోపు లబ్ధిదారులకు అప్పగించనున్న నేపథ్యంలో పెండింగ్ పనులు ఉంటే తక్షణం పూర్తి చేయాలన్నారు. మేయర్ వెంట డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చింతా మౌనిక అధికారులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాన్ని పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, అధికారులు

సురక్ష శిబిరాన్ని వినియోగించుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగలక్ష్మి



కొక్కిలిగడ్డలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనిల్

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పేదలు వినియోగించుకోవాలని సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అన్నారు. కొక్కిలిగడ్డ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రెండవ విడత జరుగుతున్న శిబిరంలో రోగులను పరిశీలించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీటీసీ దిడ్ల రాణి, మండల కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, ఉప సర్పంచ్ రాంబాబు, ఎంపీడీవో కె. శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ అనిల్, శిరీష, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

613 మందికి ఉచిత వైద్య పరీక్షలు

బంటుమిల్లి: ఆర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య(జేఎఎస్) సురక్ష ప్రత్యేక వైద్యశిబిరంలో 613 మందికి పరీక్షలు నిర్వహించినట్లు బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. వైద్య నిపుణులు వివేక్, లాస్య, అంజలీదేవి, రమణ, పవన్‌కుమార్, సౌందర్య వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరంలో ఎంపీపీ చినబాబు, ఎంపీడీవో రామకృష్ణరాజు, సర్పంచు బొర్రా రమేష్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యార్లగడ్డ(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంపీడీఓ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ శిబిరాన్ని ప్రారంభించగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు 402 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు నెలకు సరిపడా ఉచితంగా అందచేశారు. శిబిరాన్ని సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, ఎంపీటీసీ కర్రా రవి, పంచాయతీ ఈఓ పిట్టి రాంబాబు పర్యవేక్షించారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

గూడూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5,709 మంది చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు ఎంపీహెచ్‌ఓ ఎం.వీరయ్య తెలిపారు. మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1,802 మంది చిన్నారులకు, రెండు కళాశాలల్లోని 58 మంది విద్యార్థులకు, 60 పాఠశాలల్లోని 3,489 మంది చిన్నారులకు మాత్రలు వేసినట్లు ఆయన వెల్లడించారు. మండలంలో 5,755 మందికి నులిపురుగుల నివారణ మందు వేయాలని లక్ష్యం కాగా 99.20 శాతం లక్ష్యాలను సాధించినట్లు వివరించారు.
పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలో పలు పాఠశాలల్లో మొత్తం 1,069 మంది పిల్లలు ఉండగా వారిలో 1,011 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలు అందించినట్లు (95శాతం) పీహెచ్‌సీ డాక్టర్ హారిక తెలిపారు. డాక్టర్ శ్రీరామ్ సాయి, ఎంపీహెచ్ఈవో బాబూరావు, హెల్త్ ఎడ్యుకేటర్ విజయవల్లి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
పెడన: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలోని చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండాజోల్ టాబ్లెట్లను వేశారు. శుక్రవారం నులిపురుగుల నివారణ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని 10,579 మందికి గాను 10,053 మందికి టాబ్లెట్స్‌ను పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పంపిణీలో పాల్గొన్నారు.



చిన్నారులకు నులిపురుగుల నివారణ మందులు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పందెంరాయుళ్లపై కేసులు

గూడూరు: ముక్కొల్లు శివార్లలో నిర్వహిస్తున్న కోడిపందేలపై గూడూరు ఎస్సై ఐ.వీర్రాజు ఆధ్వర్యాన పోలీసులు మెరుపుదాడి చేశారు. దాడుల్లో ఏడుగురు పందెం రాయుళ్లు పట్టుబడగా వారి నుంచి కోడిపుంజు, రూ.10250 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడుల్లో పందెం రాయుళ్లు పరారయ్యారు. పందెం రాయుళ్లను వెంబడించిన పోలీసులకు ఏడుగురు చిక్కారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వీర్రాజు తెలిపారు.